క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు
తహసీల్దార్ పీఎన్వీ ప్రసాద్



ఆగిరిపల్లి:: భూ సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ పీఎన్వీ ప్రసాద్ అన్నారు. అడవినెక్కలం గ్రామ సచివాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ భూ సమస్యలు ఏమైనా ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పలు భూ సమస్యలకు సంబంధించి 35 అర్జీలు వచ్చాయని చెప్పారు. సర్పంచ్ వేము రాజు, రీ సర్వే డీటీ మరియన్న, ఆర్ఐ యూనస్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మైలవరంలో 'స్కూల్ టు ల్యాబ్'




మైలవరం: మైలవరం ఎంబీఎం బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రయోగాలు నిర్వహించుకునేందుకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహాయ సహకారం ఉంటుందని, తమ కళాశాల ప్రయోగశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కూల్ టు ల్యాబ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. స్థానిక ఎంబీఎం ప్రభుత్వ బాలికల హైస్కూల్ ప్లస్ టూ విద్యార్థినులు ఇంటర్ మీడియెట్ ప్రాక్టికల్స్ నిమిత్తం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నుంచి బుధవారం వరకు ఫిజిక్స్, రసాయన, వృక్ష, జంతు శాస్త్ర ప్రాక్టికల్స్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రవిని సన్మానించారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వి.ఫణికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు




చాట్రాయి: మొక్కజొన్న పైరుకు ఆశించిన కత్తెర పురుగు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. చనుబండ గ్రామంలో మొక్కజొన్న పైరును బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ మొక్కజొన్న పైరుకు కత్తెర పురుగు ఆశించిందని, దీని నివారణకు తొలి దశలో ఎకరాకు ఒక లీటరు వేప నూనెను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని, తొలి దశలో గొంగళి పురుగు నివారణకు ఎకరాకు 500 మిల్లీ లీటర్ల క్లోరిఫైరిపాస్‌ని 600 మిల్లీ లీటర్ల వేప నూనెతో కలిపి పిచికారీ చేయాలని, కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే బెంజోయట్ 5 ఎస్‌డీటీ 80 గ్రాములను వేప నూనెలో కలిపి ఆకులు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



ఇబ్రహీంపట్నం: ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ ఎస్ఎస్ అప్పారావు ఆర్థిక సహాయంతో ఇబ్రహీంపట్నం, కొండపల్లి జెడ్పీ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు 120 మందికి స్టడీ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.35 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం



మైలవరం: పుల్లూరు గ్రామ బీసీ కాలనీలో రూ.35 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని సర్పంచ్ నాగమల్లేశ్వరి బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పుల్లూరు గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15 లక్షలు, జనరల్ ఫండ్ నుంచి రూ.20 లక్షలతో పుల్లూరు గ్రామంలో అవసరమైన ఏరియాల్లో మూడు సీసీ రోడ్లతో పాటు కల్వర్టుల నిర్మాణాలు చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చిలుకూరి రామిరెడ్డి, ఉండ్రగుంట తిరుపతిరావు, రోశయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

చాట్రాయి: పేకాట శిబిరంపై సిబ్బందితో కలిసి మెరుపు దాడి చేశామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మండలంలోని చిత్తపూరు గ్రామాల సరిహద్దులోని మామిడి తోటలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం సాయంత్రం దాడి చేసి, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.40,000 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

సంక్రాంతి జూదాలకు సై



తిరువూరు మండలం అక్కపాలెంలో సిద్ధమైన కోడి పందేల బరి



తిరువూరులో పందేలకు సిద్ధం చేస్తున్న మామిడితోట

- కాలు దువ్వుతున్న పందెం కోళ్లు
- 12 గ్రామాల్లో కోడిపందేల బరులు
- పేకాట, గుండాటకు సిద్ధం
- రాత్రింబవళ్లు జూదాల నిర్వహణకు ఏర్పాట్లు

తిరువూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు జూదాల నిర్వహణకు తిరువూరు నియోజకవర్గంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొలుత జూదాలకు నియోజకవర్గంలో అవకాశం లేదని ప్రకటించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఐదు రోజుల పాటు సంక్రాంతి జూదాలు నిర్వహించుకోవచ్చని బహిరంగంగా ప్రకటించారు. గతంలో కంటే భిన్నంగా పలు బరులను సినిమా సెట్టింగులతో తీర్చిదిద్దేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. రెవెన్యూ డివిజినల్ అధికారి రెండు రోజుల కిందట సంక్రాంతి జూదాల నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతామని, కేసులు పెడతామని హెచ్చరించినా, పోలీసులు గ్రామాల్లో జూదాలకు అనుమతుల్లేవని ప్రచారం చేసినా ఫలితం కనిపించట్లేదు.

కేసినో కూడా ఉందని ప్రచారం..

సంక్రాంతి జూదాల్లో భాగంగా ఈ ఏడాది కేసినో జూదం కూడా ఉందని ప్రచారం జోరుగా జరుగుతోంది. తిరువూరు పట్టణంలో రెండుచోట్ల, కాకర్ల, మల్లేల, అక్కపాలెం, గంపలగూడెం, పెనుగొలను, ఊటుకూరు, కొణిజర్ల, విస్సన్నపేట, కొండపర్వ, పుట్రేల, చీమలపాడు, కంభంపాడు, పోలిశెట్టిపాడు గ్రామాల్లో ఈ ఏడాది సంక్రాంతి జూదాలు జరిగే అవకాశం ఉంది. పేకాట, గుండాట, లోనా-బయట, పులి-మేక తదితర జూదాలను కూడా సంక్రాంతి సందర్భంగా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. మద్యం కూడా జూదాల వద్ద అందుబాటులో ఉంచనున్నారు.

అనుమతులు లేవు



తిరువూరు సర్కిల్‌లో జూదాలకు ఎటువంటి అనుమతులు లేవు. గతంలో జూదాలు నిర్వహించిన వారిపైన, కోడి కత్తులు కట్టిన వారిపైన బైండోవర్ కేసులు పెడుతున్నాం. పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, పశు సంవర్థక శాఖల అధికారులతో టీం ఏర్పాటు చేసి జూదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. – గిరిబాబు, తిరువూరు సీఐ

జూదాల జోలికి పోవద్దు



సంక్రాంతి పేరుతో నిర్వహించే జూదాల్లో కాకుండా సంప్రదాయ క్రీడల్లో పాల్గొనాలి. మహిళలకు తిరువూరు నియోజకవర్గంలో ముగ్గుల పోటీలు, యువకులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలి. జూదాల్లో పాల్గొని డబ్బులు వృథా చేసుకోవద్దు.
–బి. వెంకటేశ్వరరావు, యువజన సంఘ నాయకుడు

మత్స్యకారుల జీవనోపాధే లక్ష్యం

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



ఫెర్రీ వద్ద కృష్ణానదిలో చేప పిల్లలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వసంత, ప్రజాప్రతినిధులు

ఇబ్రహీంపట్నం: మత్స్యకారుల జీవనోపాధి పెంపొందించేందుకు ప్రతి ఏడాది కృష్ణా నదిలో చేప పిల్లలను వదులుతున్నామని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద కృష్ణానదిలో 7.50 లక్షల చేప పిల్లలను బుధవారం ఆయన విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో ఫిష్ మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. పవిత్ర సంగమానికి పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కొండపల్లి మున్సిపాల్టీకి పాలకవర్గం ఎన్నికలు త్వరలో జరుగుతాయన్నారు. తొలుత మూలపాడు గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.75 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. బీసీ కమ్యూనిటీ హాల్‌తో పాటు గ్రామాభివృద్ధికి మరో రూ.1.50 కోట్లు మంజూరు చేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి అబీబ్ బాషా



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అబీబ్‌బాషా

ముసునూరు: రైతులు తమ పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అబీబ్ బాషా అన్నారు. వేల్పుచర్ల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తాను వేసిన పంట పేరు, పంట రకాన్ని ఈ-క్రాప్‌లో నమోదు చేయించాలన్నారు. పంటలకు బీమా పథకాన్ని ప్రీమియం చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. బీమా వలన ప్రయోజనాలపై అవగాహన కల్పించి, ప్రీమియం వివరాలు రైతులకు తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో పండే మొక్కజొన్నకు రూ.483, మినుముకు రూ.60, వరికి రూ.500, మామిడికి రూ.2,250 రైతు సేవా కేంద్రంలో పంట ధ్రువీకరణ పత్రం పొందిన అనంతరం కామన్ సర్వీస్ సెంటర్‌లో ప్రీమియం చెల్లించాలన్నారు. నూజివీడు ఏడీఏ విద్యాసాగర్, మండల వ్యవసాయాధికారి చినసూరిబాబు, సర్పంచ్ పుట్ల మోహనరావు, ఎంపీటీసీ గరికిముక్కు సుబ్బారావు, వీహెచ్ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

గంపలగూడెం: వికాస తరంగిణి గంపలగూడెం శాఖ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా సముద్రాల జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా హెచ్చా సుధారాణి, కోశాధికారులుగా చారుగుండ్ల నాగలక్ష్మి, కొల్లా సత్యవతి ఎన్నికయ్యారు.

గోదాదేవికి సారె సమర్పణ

గంపలగూడెం: ధనుర్మాసోత్సవాల్లో గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి, సీతారామచంద్రులకు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా అమ్మవారికి సారె సమర్పించారు. తొలుత సారెతో మహిళలు గ్రామంలోని ప్రధాన వీధుల వెంట ఊరేగింపు జరిపారు.

కనుల విందుగా ముత్యాల హారతి

గంపలగూడెం భజన మందిరం, సీతారామచంద్ర స్వామి ఆలయాల్లో ముత్యాల హారతి కార్యక్రమాన్ని కనులవిందుగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మహిళలు పళ్లెంలో కుందులను ఉంచి చుట్టూ ముత్యాల దండలతో చూడముచ్చటగా అలంకరించారు. అమ్మవారికి ప్రతి ఒక్కరూ హారతి పట్టారు. పెనుగొలను, ఊటుకూరు రామాలయాల్లో, పెద్దకొమిర వెంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుప్పావై పఠనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో అమ్మవారికి నక్షత్ర హారతి ఇచ్చారు.

- **తిరువూరు:** ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీవేంకటాచలస్వామి ఆలయంలో బుధవారం గోదాదేవికి సారె సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో వేంకటాచలస్వామికి, గోదాదేవికి సేవాకాలం, ప్రాతఃకాల అర్చన అనంతరం ముత్యాల హారతి సమర్పించారు. పండ్లు, పూలు, పసుపు, కుంకుమ, తులసీదళాలు, వివిధ రకాల వంటకాలను అమ్మవారికి సారెగా సమర్పించారు. వైష్ణవగోష్ఠి సభ్యులు పాల్గొన్నారు. రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయంలో తీర్థగోష్ఠి, గోదా కృష్ణులకు ముత్యాల హారతి సమర్పించారు.



అమ్మవారికి సమర్పించే సారెతో మహిళలు

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ధర్నా

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచడం గర్హనీయమని సీపీఎం తిరువూరు మండల కార్యదర్శి ఎం. నాగేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్ఆర్ టవర్స్ సెంటర్‌లో బుధవారం విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో వినియోగదారులపై అదనపు భారం మోపడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి దొడ్డిదారిన విద్యుత్ చార్జీలు పెంచడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని నాగేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. నాయకులు భద్రం, వెంకటరత్నం, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- **మైలవరం:** మైలవరం తారక రామానగర్‌లో సీపీఎం నాయకురాలు షేక్ మైబూబి ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మైలవరం మండలం కార్యదర్శి సీహెచ్ సుధాకర్, నాయకులు ఆశ, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

- **ఇబ్రహీంపట్నం:** విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఇబ్రహీంపట్నంలో సీఐటీయూ, సీపీఎం నాయకులు బుధవారం ఆందోళన నిర్వహించారు. సీఐటీయు మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల ఒప్పందాలతో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి రైతులు, వ్యాపారులు, సామాన్యులపై విద్యుత్ భారం మోపారని ధ్వజమెత్తారు. ఐద్వా, సీపీఎం నాయకులు బీబీ సరోజినీ, కొండలరావు, షేక్ బాషా, రమణమ్మ పాల్గొన్నారు.
- **విస్సన్నపేట:** ప్రజలకు భారంగా మారిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ విస్సన్నపేటలో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ బిల్లులను తగులబెట్టారు. విస్సన్నపేట బస్టాండ్ సెంటర్‌లో మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. నాయకులు ఆకుల శ్రీనివాసరావు, రాము, మహిళలు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.



విస్సన్నపేటలో కరెంటు బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

మర్రిబంధంలో విషాద ఛాయలు

నూజివీడు: మండలంలోని మర్రిబంధంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తాగిన మత్తులో తండ్రి కొడుకుపై కర్రతో దాడి చేసిన ఘటనలో కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తల్లడిల్లుతున్నారు. అప్పికొండ గోవిందరావు, అతని కుమారుడు నాగభూషణం రోజువారీ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వారు. ఇద్దరూ మద్యానికి బానిసలే. ఈ నెల 7న గొడవ పడి మద్యం మత్తులో తండ్రి గోవిందరావు కర్రతో కొట్టడంతో కొడుకు నాగభూషణం మృతిచెందిన విషయం తెలిసిందే. నాగభూషణం మృతదేహానికి బుధవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడికి ఇరువురు కుమారులుండగా పెద్ద కుమారుడు అప్పికొండ పవన్‌కుమార్ (12) ఏడో తరగతి చదువుతుండగా, చిన్న కుమారుడు గౌతమ్‌కుమార్ (10) ఐదో తరగతి చదువుతున్నాడు. మృతుడి భార్య, కుమారులిద్దరూ ఏరియా ఆస్పత్రి వద్ద రోధిస్తుంటే వారిని ఆపడం ఎవరితరం కాలేదు. ఇంత దారుణం జరగడానికి మద్యమే కారణమని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తండ్రిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులు

డైరీ ఆవిష్కరణ



విస్సన్నపేట: రిటైర్డు ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్లను వెంటనే అందజేయాలని విస్సన్నపేట రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూరిరాజు కోరారు. స్థానిక రిటైర్డు ఉద్యోగుల సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ పెన్షను సక్రమంగా పొందడానికి లైఫ్ సర్టిఫికెట్లు తప్పక ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పోతనపల్లి గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. దారావతు శ్రీను వద్ద 20 లీటర్ల సారా, మోపెడ్‌ను స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచామని చెప్పారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ఆగిరిపల్లి: సారా తయారీకి అక్రమంగా నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బాపులపాడు మండలం సింగన్నగూడేనికి చెందిన బెజవాడ రమేష్‌పై కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ మస్తానయ్య ఆధ్వర్యంలో జరిగిన దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ ఎండీ ఆరిఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వహణ చట్ట విరుద్ధం
పశువైద్యాధికారి అభిలాష్

గంపలగూడెం: పండుగ పేరుతో కోడిపందేలు నిర్వహించడం చట్టవిరుద్ధమని ఊటుకూరు పశువైద్యులు డి. అభిలాష్ అన్నారు. ఊటుకూరులో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా కోడి పందేలు నిర్వహిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తుంటే వెంటనే మండల అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కోడి పందేల నియంత్రణకు మండలంలోని ప్రతి పంచాయతీ పరిధిలో పశు సంవర్థక సహాయకులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు సంప్రదాయ ఆటలను ఆడుకోవాలని సూచించారు.

వైభవంగా దీపోత్సవం



ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మహిళలు వైభవంగా దీపోత్సవం నిర్వహించారు. ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకొని గ్రామానికి చెందిన మహిళా భక్తులు లక్ష్మీనరసింహునికి ప్రత్యేక పూజలు చేసి, దీపోత్సవం నిర్వహించారు. దీపాలతో ఆలయ ప్రాంగణమంతా దేదీప్యమానంగా వెలిగింది.

ట్రిపుల్ ఐటీకి అంబులెన్స్ బహూకరణ



నూజివీడు: సామాజిక బాధ్యత కింద ఎస్‌బీఐ నూజివీడు ట్రిపుల్ ఐటీకి రూ.35 లక్షల విలువైన అంబులెన్స్‌ను బుధవారం బహూకరించింది. అంబులెన్స్‌ను ఎస్‌బీఐ డెప్యూటీ జనరల్ మేనేజర్ మనీష్ కుమార్ సింగ్, మరో డెప్యూటీ జనరల్ మేనేజర్ మోహిత్ కుమార్, రీజనల్ మేనేజర్ ఆర్.రాఘవరావు ప్రారంభించారు. మనీష్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ అంబులెన్స్ ద్వారా విద్యార్థులకు, సిబ్బందికి అత్యవసర సమయాల్లో వైద్య చికిత్సను అందించేందుకు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఉపయోగపడుతుందన్నారు. దీనిలో అధునాతన పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, ఏఓ బి.లక్ష్మణరావు, ఎస్‌బీఐ ట్రిపుల్ ఐటీ బ్రాంచి మేనేజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

ఆగిరిపల్లి: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ ఆగిరిపల్లి మండల శాఖ అధ్యక్షుడు మక్కే వేణుగోపాలరావు అన్నారు. మూడు రోజులుగా జరుగుతున్న ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఎస్టీయూ మండల కార్యదర్శి కొవ్వలి కోటమ్మ, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చౌటపల్లి సురేష్, ఏలూరు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తాడి నరసింహారావు, ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ హక్ పాల్గొన్నారు.

క్యాలెండర్లు, సీఎల్ బుక్స్ పంపిణీ

ముసునూరు: ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ జీతాలను తక్షణం విడుదల చేయాలని ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ రత్నం, కొప్పుల బాబూరావు డిమాండ్ చేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు పి.రామరాజేశ్వరి, కె.కుటుంబరావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన 2025 క్యాలెండర్లు, సీఎల్ బుక్స్, లంచ్ బ్యాగులను మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం పంపిణీ చేశారు. ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్లు సాయిబాబు, హరిబాబు, మండల ఉపాధ్యక్షుడు ఎం.రవికిరణ్, కార్యదర్శులు నాగరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లు హెచ్చరిక

జి.కొండూరు: సంప్రదాయం ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. జి.కొండూరు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జరిగిన అవగాహనా సదస్సులో తహసీల్దార్ మాట్లాడుతూ ఎక్కడైనా బరులు సిద్ధం చేసి ఉంటే తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలుకు ఆదేశాలు జారీ చేశారు. కోడి పందేలు నివారించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. రెండు జంతువులు పోరాడితే ఆనందించడం తగదన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ కోడి పందేలు, జూదాలను అరికడదామన్నారు. శని, ఆదివారాల్లో కోడి పందేలు జరుగుతున్నాయని మిన్నకుండవద్దని, మండల, గ్రామ కమిటీల ద్వారా పందేలను నివారించవచ్చన్నారు. ఎస్ఐ సతీష్ కుమార్, ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, వెటర్నరీ డాక్టర్ మురళీ కృష్ణారెడ్డి, ఎంఈఓ నరసింహారావు, ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

మైలవరం: పుల్లూరు శివారు చిలుకూరువారిగూడెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, చంద్రగూడెం జెడ్పీ హెచ్ స్కూల్, మైలవరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తోందన్నారు. నాయకులు పాల్గొన్నారు.

శోభనాచలుని ఆలయం ముస్తాబు

ఆగిరిపల్లి: శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనృసింహ స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు ఉత్తర ద్వార దర్శనం కోసం ఆలయం ముస్తాబైంది. వేకువ జామున మూడు గంటలకు సుప్రభాత సేవ, విశేష అభిషేకాలు, ధనుర్మాస నిత్య అర్చనలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు తెలిపారు. ఉదయం ఐదు గంటలకు ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ సాయి తెలిపారు. అనంతరం తొమ్మిది గంటలకు స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

పాఠశాల అభివృద్ధికి విరాళాలు

తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు బుధవారం విరాళాలు అందజేశారు. ప్రవాసాంధ్రుడు తోట సురేష్ రూ.10,116, కాంట్రాక్టరు ముత్యాల మధుసూదనరావు రూ.5 వేలు పాఠశాలలో సైకిల్‌షెడ్ నిర్మాణ నిమిత్తం అందజేశారని ప్రధానోపాధ్యాయిని లక్ష్మి తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్

ముసునూరు: బీజేపీ మండల అధ్యక్షుడిగా కాట్రేనిపాడుకు చెందిన బడుగు శ్రీకాంత్ నియమితులయ్యారు. బుధవారం ముసునూరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనను పలువురు అభినందించారు.

లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత



తిరువూరు: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం నిరుద్యోగ నిర్మూలనకు చేయూత నిస్తుందని బీజేపీ నాయకుడు అన్నవరపు సత్యనారాయణ అన్నారు. కోకిలంపాడుకు చెందిన విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. చేతి వృత్తుల వారికి ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూర్చేందుకు కేంద్రం కృషి చేస్తోందన్నారు. బీజేపీ మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు భవాని, నాయకులు పాల్గొన్నారు.